క్లుప్తంగా

గోనెగండ్లలో 81 శాతం పోలింగ్ నమోదు



గోనెగండ్ల 239 పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు మొరాయించడంతో వేచి ఉన్న ఓటర్లు

గోనెగండ్ల: మండలంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సాయంత్రం 8 గంటల వరకు 81 శాతం పోలింగ్ నమోదైంది. గోనెగండ్లలోని 239 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం పనిచేయకపోవడంతో దాదాపు రెండు గంటల పాటు ఓటర్లు బూత్ దగ్గరే కూర్చొని వేచి చూశారు. ఎమ్మిగనూరు నుంచి వచ్చిన సిబ్బంది ఈవీఎంను సరిచేయడంతో 9 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. అలాగే సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి కులుమాల గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆ గ్రామంలోని రెండు పోలింగ్ బూత్‌లలో 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. యువకులు, ప్రజలు, వృద్ధులు ఉత్సాహంగా తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలాగే వేముగోడు, ఐరన్‌బండ, అలువాల తదితర గ్రామాల్లో వృద్ధులు వీల్ చైర్‌లో వచ్చి ఓటు వేశారు. గోనెగండ్ల మోడల్ పోలింగ్ కేంద్రాన్ని అడిషనల్ ఎస్పీ నాగబాబు పరిశీలించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. అలువాల, పెద్దనేలటూర్, హెచ్.కైరవాడి గ్రామాల్లో కన్వీనర్ బీఆర్ బసిరెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బుట్టా ప్రతుల్ పోలింగ్ సరళిని పరిశీలించారు. అలాగే గోనెగండ్లలో సాయంత్రం ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య మోడల్ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని పరిశీలించారు. వీరి వెంట వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రమోద్ కుమార్ రెడ్డి, నాగేష్ నాయుడు, రవి కుమార్ నాయుడు తదితరులు ఉన్నారు.

ఓటు కోసమే ఇండియాకు వచ్చా

– పి.ఫారుక్ బాషా, గోనెగండ్ల



నేను సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఫార్మాసిస్టుగా పనిచేస్తున్నాను. 15 ఏళ్లుగా అక్కడే ఉంటున్నాను. ఎన్నికలు జరిగితే ఇండియాకు వచ్చి ఓటు వేసి తిరిగి వెళ్లిపోతాను. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకే దేశానికి వచ్చాను. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో గొప్పది కాబట్టే ఎన్ని పనులు ఉన్నా స్వగ్రామానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకుంటాను. ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

ముగిసిన ఓట్ల పండుగ



ఇబ్రహీంపురంలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు



నందవరం: అత్తను ఓటు వేసేందుకు తీసుకెళ్తున్న కోడలు

నందవరం: మండలంలో సోమవారం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. రెండు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో కాస్త ఆలస్యంగా ఓటింగ్ ప్రక్రియ మొదలైంది. మండలంలో మొత్తం 58 పోలింగ్‌కేంద్రాల పరిధిలో 47,287 మంది ఓటర్లు ఉన్నారు. జొహరాపురం గ్రామంలో ఈవీఎంలు మొరాయించడంతో 8.30 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. గంగవరం గ్రామంలో ఈవీఎం సమస్యతో మధ్యాహ్నం గంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. టెక్నికల్ అధికారులు వచ్చి సరిచేయడంతో పోలింగ్ కొనసాగింది. ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి జనం ఇళ్ల వద్దనే ఉన్నారు. సోమవారం ఉదయమే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక మండల కేంద్రంతో పాటు మాచాపురం, ఇబ్రహీంపురం గ్రామాల్లో పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. నందవరం మండలంలో 40,950 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 86.15 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ఏర్పాట్లను ఏఆర్వో ఓబులేసు పర్యవేక్షించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

డ్రిప్ సామగ్రికి నిప్పు

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పొలంలో ఉన్న డ్రిప్పు పైపులకు నిప్పుపెట్టారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ తలారి కృష్ణయ్య సోదరుడు తలారి రాముడుకు చెందిన 5 ఎకరాల్లో ఉపయోగించే డ్రిప్పు పైపులను చుట్టి పొలంలోనే ఒకచోట ఉంచారు. అక్కడే ఆరు క్వింటాళ్ల పత్తి సైతం ఉంచారు. రోజు మాదిరిగానే ఉదయం పొలానికి వెళ్లి చూడగా పత్తిలో నుంచి పొగ రావడం గమనించి పరిశీలించగా అప్పటికే డ్రిప్పు పైపులు, పత్తి కాలిపోయాయి. తెల్లవారుజామున వర్షం పడడంతో పక్కనే ఉన్న మేత వాములకు ప్రమాదం తప్పినట్లు గుర్తించాడు. రూ.70 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

- పండుగను తలపించిన ఓటింగ్ ప్రక్రియ
- ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల క్యూ
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్
- ఉదయం మందకొడిగా ప్రారంభమై తర్వాత ఊపందుకున్న ఓటింగ్
- పలు చోట్ల ఈవీఎంల మొరాయింపుతో ఆలస్యం
- 82 శాతం పోలింగ్ నమోదు



ఎమ్మిగనూరులో స్థానిక ఓటర్లతో కలిసి సిరా గుర్తును చూపుతున్న ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య



వీవర్స్ కాలనీ హైస్కూల్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న బుట్టా రేణుక దంపతులు



ఎమ్మిగనూరు మండలం ఎర్రకోటలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి



వృద్ధురాలిని వీల్‌చైర్‌పై పోలింగ్‌బూత్‌లోకి తీసుకెళ్తున్న సిబ్బందితో ఆర్‌ఓ చిరంజీవి, కమిషనర్

ఓటరు.. హుషారు

సార్వత్రిక ఎన్నికల పోరులో భాగంగా సోమవారం ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో చెదురుముదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటలనుంచి పోలింగ్ ప్రారంభం కాగా సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ ఏజెంట్లు ఉదయం 5.30 గంటలకే పోలింగ్ కేంద్రలకు చేరుకోగా వారి సమక్షంలో ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని పరిశీలించి మాక్ పోలింగ్ నిర్వహించారు. తర్వాత 7 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్‌కు కొద్దిసేపు అంతరాయం కలిగింది. టెక్నికల్ అధికారులు వాటిని సరిచేసి పోలింగ్ కొనసాగించారు. ఉదయం నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు బారులు తీరారు. అధికారులు తగిన ఏర్పాట్లు చేయడంతో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వివిధ ప్రాంతాలకు స్వగ్రామాలకు చేరుకున్న వారంతా ఉత్సాహంగా ఓటు వేశారు. వృద్ధులు, దివ్యాంగులు సహాయకుల ద్వారా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేసి మత కర్తవ్యాన్ని నెరవేర్చారు. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ తర్వాత గంట గంటకూ పెరుగుతూ పోయింది. పోలింగ్ ప్రక్రియ అనంతరం ఈవీఎంలను పటిష్ట భద్రత నడుమ ఆయా ప్రాంతాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలింగ్‌ను వెబ్ క్యాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు. కేంద్ర బలగాలు, వివిధ రాష్ట్రాల పోలీసులతో పాటు స్థానిక సిబ్బందితో బందోబస్తులు విధులు నిర్వహించారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో సోమవారం ఉదయం ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 వరకు ప్రశాంతంగా కొనసాగింది. నియోజకవర్గంలోని 272 పోలింగ్ కేంద్రాల్లో 2,47,752 మందికిగాను 2,03,174 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 82.01 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆర్‌ఓ చిరంజీవి వెల్లడించారు. ఉదయం ఎస్ఎంఎస్ జెడ్పీ హైస్కూల్‌లోని 151 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం 10 నిమిషాలపాటు మొరాయించగా ఏఈ శరత్‌చంద్ర సరిచేయడంతో పోలింగ్ యథావిధిగా కొనసాగింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆ పోలింగ్ కేంద్రం ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఓటర్లు కొంత ఇబ్బంది పడ్డారు. వీవర్స్ కాలనీ జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, ఆమె భర్త బుట్టా శివనీలకంఠ ఓటు హక్కు వినియోగించుకోగా కడిమెట్ల గ్రామంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఓటు వేశారు. పట్టణంలోని పలు కేంద్రాల్లో పోలింగ్ సరళిని బుట్టా రేణుక పరిశీలించారు. ఆర్‌ఓ చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా, ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకున్నారు. పట్టణ, రూరల్ సీఐలు మధుసుదన్ రావు, మోహన్‌రెడ్డి, రామకృష్ణ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు మధ్య పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని ఎర్రకోట గ్రామం 191 పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, కడిమెట్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీపీ గొల్ల కేశన్న, గుడేకల్‌లో వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, వై.పురుషోత్తం గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడం శుభ పరిణామమని నాయకులు తెలిపారు.

రాయలసీమలో ఫ్యాన్ హవా ఖాయం

రాయలసీమ జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయం అని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎర్రకోటలో ఓటు వేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక 50 వేల మెజార్టీతో గెలుపొందుతారని జోస్యం చెప్పారు. ఎంపీగా బీవై.రామయ్య గెలుపొందడమే గాక మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు.



గుడేకల్‌లో ఓటు వేసేందుకు తరలివచ్చిన మహిళలు



ఎంఎస్ నగర్‌లో పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వృద్ధురాలిని ఎత్తుకొస్తున్న దృశ్యం



గుడేకల్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న రూరల్ సీఐ మోహన్ రెడ్డి



గుడేకల్ జెడ్పీ హైస్కూల్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు




వెంకటాపురం కాలనీలో టీడీపీ నాయకుడిని హెచ్చరిస్తున్న పట్టణ సీఐ



ఎమ్మిగనూరు ఎంఎస్ హైస్కూల్లో వర్షపు నీరు నిలవడంతో ఇబ్బంది పడుతున్న ఓటర్లు



కడిమెట్లలో ఓటు వేసిన ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీపీ గొల్ల కేశన్న



గుడేకల్‌లో ఓటు వేసిన వై.రుద్రగౌడ్

పోటెత్తిన ఓటరు



తుంగభద్ర పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు



కాచాపురం 33వ పోలింగ్ బూత్లో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి, సతీమణి వై.జయమ్మ



మంత్రాలయంలో ఓటు హక్కు వినియోగించుకున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



రాంపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న టీటీడీ పాలకమండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి

మంత్రాలయం: ఓటర్లు పోటెత్తారు.. ప్రజాతీర్పునిచ్చేందుకు బారులు తీరారు. ఓటును వినియోగించుకుని రాజ్యాంగ హక్కును చాటుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మంత్రాలయం నియోజకవర్గంలో 84.51 శాతం మంది ప్రజలు ఓట్లు వేశారు. జగడాలకు తావు లేకుండా ప్రశాంతంగా పోలింగ్ సరళిలో పాలుపంచుకున్నారు. సోమవారం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఎ.మురళీ నేతృత్వంలో పోలింగ్ నిర్వహణ కొనసాగింది. మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం 237 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం వర్షం కారణంగా ఓటర్లు ఆలస్యంగా పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. 7 గంటలకు పోలింగ్ ప్రారంభకాగా 9 గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్యలో పోలింగ్ శాతం ఊపందుకుంది. ఒంటిగంటకు 42.63 శాతం, మూడు గంటలకు 55.36 శాతం, ఐదు గంటలకు 65.78 శాతం చొప్పున పెరుగుతూ పోయింది. నియోజకవర్గంలో మొత్తం 2,08,350 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,02,155 మంది, మహిళలు 1,06,172 మంది, ఇతరులు 23 మంది ఉన్నారు. అందులో మొత్తం 1,76,077 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఆలస్యంగా పోలింగ్

నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల మొరాయింపు, పోలింగ్ సిబ్బంది ఉదాసీనత కారణంగా ఆలస్యంగా ముగిసింది. రాత్రి 9 గంటల వరకు పోలింగ్ సాగింది. కోసిగి, వందగల్లు, చిన్నభూంపల్లి, చింతకుంట, పెద్దకడబూరు (బూత్‌లు 204, 206), కందకూరు, అర్లబండ, చెట్నిహళ్లి, రొడూరు, హాల్వి, చూడి, సులేకేరి గ్రామాల్లో పోలింగ్ ఆలస్యమైంది.



కాచాపురంలో ఇతరుల సాయంతో ఓటేసేందుకు వస్తున్న పెరాలసిస్ బాధితుడు



కాచాపురంలో ఓటరును వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న దృశ్యం



కామన్ దొడ్డి గ్రామంలో ఓటు వేసేందుకు వెళుతున్న వృద్ధురాలు



సిరా గుర్తును చూపుతున్న కౌతాళం సింగిల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు తదితరులు



అర్లబండలో ఓటు వేసేందుకు వృద్ధురాలిని చక్రాల బండిపై తీసుకెళుతున్న దృశ్యం

ఆదోనిలో ప్రశాంతంగా పోలింగ్



సాయి కళాశాల కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



మున్సిపల్ ఉన్నత పాఠశాల కేంద్రంలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ప్రజలు



సాయి కళాశాలలో ఓటు వేసి తిరిగి వెళ్తున్న వృద్ధురాలు లక్ష్మీదేవి

ఆదోని టౌన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఆదోని నియోజకవర్గంలో ప్రశాంతంగా జరిగింది. చెదురుముదురు సంఘటనలు లేకపోయినా పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మరో ఏడుగురు స్వతంత్ర్య అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. పెద్దతుంబళం, కుప్పగల్, ధణాపురం, దిబ్బనకల్, బసరకోడు, బల్లేకల్ గ్రామాలు, ఆదోని పట్టణంలోని జీవేశ్వర స్కూల్‌లో ఈవీఎంల మొరాయింపుతో 20 నిమిషాల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. నియోజకవర్గంలో 2,63,058 మంది ఓటర్లు ఉండగా మొత్తం 256 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. రాత్రి 8:30 గంటల సమయానికి 59.35 శాతం పోలింగ్ నమోదైంది. పలుచోట్ల పోలింగ్ ఇంకా కొనసాగుతోంది. మధ్యాహ్నం 12 నుంచి 1 గంట మధ్య భోజనం సమయం కావడంతో పోలింగ్ మందకొడిగా సాగింది. సాయంత్రం 4 గంటల సమయానికి ఓటర్లు ఒక్కసారిగా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. క్యూలో నిల్చొని ఓటుహక్కును వినియోగించుకున్నారు.

కరుణించిన వరుణుడు

ఆదివారం వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. అర్ధరాత్రి సమయానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ఏకధాటిగా ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో ఓ మోస్తరుగా కురిసింది. ఉదయం 7 గంటలైనా చిరుపాటి జల్లులు, చల్లని జల్లులు కురుస్తూనే ఉన్నాయి. చల్లని వాతావరణంలో ప్రజలు ఓట్లు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. చినుకులు పడుతున్నా అక్కడి షామియానాల కింద వేచి ఉండి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని సాయి జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, సతీమణి శైలజ, కుమారుడు మనోజ్‌కుమార్ రెడ్డి, కోడలు హిరణ్మయిరెడ్డి, కుటుంబసభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ విక్టోరియాపేటలోని గుజరాతి స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.



ఎస్‌కేడీ కాలనీ కేంద్రం వద్ద సిరా గుర్తును చూపుతున్న దివ్యాంగురాలు



వైఎంకే పాఠశాల కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్



ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఓటు వేసేందుకు మరొకరి సాయంతో వచ్చిన వృద్ధుడు



ఆదోనిలో ఓటుహక్కు వినియోగించుకున్న వృద్ధురాలు కృష్ణమ్మ



సాయి కళాశాల కేంద్రంలో వృద్ధురాలిని ఓటు వేసేందుకు తీసుకొస్తున్న దృశ్యం



మున్సిపల్ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్త్ సెంటర్‌లో సిబ్బంది



ఖాజీపురా వీధిలో వృద్ధురాలిని వీల్‌చైర్‌పై తీసుకొస్తున్న దృశ్యం



దిబ్బనకల్‌లో ఓటు వేసి సిరా గుర్తును చూపుతున్న హిజ్రా

కౌతాళంలో ఓటు జాతర



రాఘవేంద్రారెడ్డి కుటుంబంలో ఓటు వేసిన పది మంది సభ్యులు

కౌతాళం: కౌతాళం మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 69 మంది పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 83 శాతం పోలింగ్ శాతం నమోదైంది. గుడికంబాలిలో అధికంగా 91 శాతం పోలింగ్ నమోదుకాగా, కౌతాళంలో 80 శాతం, కామవరంలో 88 శాతం, తోవి గ్రామంలో 88 శాతం, కుంటనహాల్‌లో 86 శాతం ఓట్లు పోలయ్యాయి. కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు కుటుంబ సభ్యులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి ఓటు వేశారు. సీనియర్ నాయకుడు రాఘవేంద్రా రెడ్డి కుటుంబంలోని పది మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. తన ఇంట్లో ముగ్గరు కొత్త ఓటర్లుగా నమోదయ్యారని ఆయన తెలిపారు. ప్రజలందరూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డితో పాటు పోలీసు బృందాలు బందోబస్తు చర్యలు చేపట్టారు.